## బీహార్‌లో ఎన్డీయే మేనిఫెస్టో విడుదల




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మరికొన్ని రోజుల్లో జరగనుంది. దీంతో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచార జోరును పెంచాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు హామీల వర్షం కురిపిస్తున్నాయి. బీహార్ అధికార ఎన్డీయే కూటమి శుక్రవారం ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. పట్నాలో జరిగిన కార్యక్రమంలో 'సంకల్ప పత్ర' పేరుతో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, బీహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ఈ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఎల్జేపీ (రాంవిలాస్) పార్టీ చీఫ్ చిరాగ్ పాసవాన్ కూడా పాల్గొన్నారు.

AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

## డీప్ ఫేక్‌ను అడ్డుకోవాలి : మెగాస్టార్ చిరంజీవి



**అక్షరటుడే, హైదరాబాద్ :** డీప్ ఫేక్‌ను అడ్డుకోవాల్సిందేనని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. ఇటీవల ఆయన డీప్ ఫేక్ వీడియోలను క్రియేట్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఆయన హైదరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా చేపట్టిన హైదరాబాద్ పోలీసులు నిర్వహించిన యూనిటి రన్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీప్ ఫేక్‌ను అడ్డుకోవడానికి చట్టాలు తీసుకు రావాలని కోరారు.

31-10-2025 (Friday) MAIN EDITION

## వరద ప్రాంతాల్లో సీఎం ఏరియల్ సర్వే



**అక్షరటుడే, వరంగల్:** మొంథా తుపాన్ ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. తుపాన్ ప్రభావిత ప్రాంతాలను సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. హెలికాప్టర్ నుంచి హుస్నాబాద్, హన్మకొండ, వరంగల్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు.

## పార్క్ స్థలాన్ని కాపాడిన హైడ్రా



**అక్షరటుడే, హైదరాబాద్:** మేడ్చల్ జిల్లా ఘటకేసర్ మండలం పోచారం మున్సిపాలిటీ పరిధిలో 4 వేల గజాల పార్క్ స్థలాన్ని హైడ్రా కాపాడింది. లే అవుట్ వేసిన వారే ఆ స్థలాన్ని ఆక్రమించారు. దీంతో స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం హైడ్రా అధికారులు రంగంలోకి దిగి కబ్జాలను తొలగించారు.

## కోమటిరెడ్డిని కలిసిన 'మహా' మినిస్టర్



**అక్షరటుడే, హైదరాబాద్:** మహారాష్ట్ర మంత్రి ఆశిష్ షెలార్ హైదరాబాద్‌లోని సచివాలయంలో సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కలిశారు. సినీ పరిశ్రమ అభివృద్ధి, రెండు రాష్ట్రాల మధ్య సహకారం కోసం ప్రభుత్వ విధానాలపై చర్చించారు. మహారాష్ట్ర ఫిల్మ్ సిటీని సందర్శించాలని ఆయన కోమటిరెడ్డిని ఆహ్వానించారు.

## మాగంటి సునీతపై కేసు నమోదు

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై పోలీసులు కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ పార్టీ గుర్తు ఉన్న ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేయడంతో బోరబండ పోలీసులు కేసు ఫైల్ చేశారు. నవంబర్ 11న నియోజకవర్గంలో పోలింగ్ జరగనుంది. దీంతో ప్రధాన పార్టీలు ప్రచారంలో దూసుకుపోతున్నాయి. ఓటరు స్లిప్పులు పంపిణీ చేయొద్దని గతంలో ఎన్నికల సంఘం పార్టీలను ఆదేశించింది. ఎన్నికల సిబ్బంది మాత్రమే పంపిణీ చేస్తారని చెప్పింది. అయినా కూడా బీఆర్ఎస్ నాయకులు ఓటరు స్లిప్పులు పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ నేతలు రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో బోరబండ ఠాణాలో ఆమెపై కేసు నమోదైంది.

## శ్రీవారి మెట్ల మార్గంలో చిరుత..

**అక్షరటుడే, తిరుమల :** తిరుపతిలో చిరుత సంచారంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. తిరుపతి శ్రీవారి మెట్టు మార్గంలో 150వ మెట్టు దగ్గర చిరుత రోడ్డు దాటుతుండగా శుక్రవారం ఉదయం భక్తులు చూశారు. చిరుతను చూసి భయంతో భక్తులు కేకలు వేశారు. దీంతో అది సమీపంలోని అడవిలోకి వెళ్లిపోయింది. చిరుత సంచారంపై సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. టీటీడీ, ఫారెస్ట్ అధికారులు అప్రమత్తం అయ్యారు. భక్తులను గుంపులు గుంపులుగా మెట్ల మార్గంలో పంపిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

**కృత్రిమ మేధా (ఏఐ) కొలువులకు ఎసరు పెడుతోంది. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న మల్టీ నేషన్ కంపెనీలు (ఎంఎన్‌సీ) ఖర్చు తగ్గించుకోవడానికి చూస్తున్నాయి. లక్షలాది ఉద్యోగులకు ఊడబీకుతున్నాయి. ఇప్పటికే గూగుల్, టీసీఎస్, మైక్రోసాఫ్ట్, మెటా వంటి ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలు వేలాది మందిని తొలగించగా, తాజాగా అమెజాన్ కూడా అదే బాటలో చేరింది. ఇటీవల 14 వేల మందిని ఇంటికి పంపించేసింది. కొద్దిరోజులుగా కృత్రిమ మేధా విస్తరిస్తున్న కొద్దీ లేఆఫ్‌ల సంఖ్య పెరుగుతోంది. ఒకటి, రెండు కాదు.. దాదాపు మెజార్టీ సంస్థలు ఉద్యోగులను తొలగించే పనిలో పడ్డాయి.**

– అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# ఊడుతున్న ఉద్యోగాలు



■ ఐటీ రంగంలో భారీగా లేఆఫ్స్ ■ ఎంప్లాయీస్‌ను తొలగిస్తున్న ఎంఎన్‌సీలు ■ విస్తరిస్తున్న కృత్రిమ మేధా

అంతర్జాతీయ దిగ్గజాలుగా పేరొందిన అనేక కంపెనీలు లేఆఫ్‌ల బాట పట్టాయి. ఏఐ రాకతో మానవ వనరులను తగ్గించుకునే పనిలో పడ్డాయి. భారీ వేతనాలతో కూడిన సిబ్బందిని ఇంటికి పంపించేస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ రంగమే కాదు, మానుఫ్యాక్చరింగ్, సర్వీస్, హెల్త్‌కేర్ తదితర సెక్టార్లలో ఉద్యోగుల కోత భారీగా కనిపిస్తోంది. లాజిస్టిక్స్ దిగ్గజం యూపీఎస్ గతేడాది నుంచి 48వేల మంది ఉద్యోగులను తొలగించింది. 2024 ప్రారంభంలో యూపీఎస్‌లో 5 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. 2024లో నిర్వహణ బృందంలో 14వేల మందిని తొలగించారు. ఈ సంవత్సరం డ్రైవర్, గిడ్డంగి విభాగాల్లో 34వేల మంది ఉద్యోగాలు కోల్పోయారు. మల్టీ నేషనల్ కంపెనీల్లోనూ భారీగా లేఆఫ్స్ సాగుతున్నాయి. దీనివల్ల లక్షల మంది ఉద్యోగాలను కోల్పోయి రోడ్డున పడ్డారు. తొలి విడతలో భారీగా సిబ్బందిని తొలగించిన అమెజాన్.. ఇటీవల 14 వేల మందిని ఇంటికి పంపించింది. ఇంటెల్‌లో 24,000, నెస్లెలో 16,000, యాక్సెంచర్‌లో 11,000, ఫోర్డ్‌లో 11,000, నోవో నార్డిస్క్‌లో 9,000, మైక్రోసాఫ్ట్‌లో 7,000, ప్రైస్ వాటర్‌హౌస్ కూపర్స్‌లో 5,600, సేల్స్‌ఫోర్స్‌లో 4,000 ఉద్యోగాల తొలగింపునకు చర్యలు చేపట్టాయి.

### జస్ట్ మెసేజ్‌తో..

భారీగా ఉద్యోగులను ఇంటికి పించిన అమెజాన్ అందుకు అనుసరించిన తొలగింపు విధానం చర్చనీయాంశమైంది. ఒకేసారి 14వేల మంది ఉద్యోగును తొలగించే క్రమంలో అనుసరించిన వైఖరిపై విమర్శలకు తావిచ్చింది. కేవలం టెక్స్ట్ మెసేజ్ ద్వారా వారిని రిలీవ్ చేయడం వివాదాస్పదమైంది. ఆఫీస్‌కు వచ్చే ముందు తమ వ్యక్తిగత లేదా అధికారిక ఈమెయిల్‌లను తనిఖీ చేయాలని ఒక టెక్స్ట్ మెసేజ్‌లో సూచించింది. తమ 'రోల్' గురించి ఈమెయిల్ మెసేజ్ రానివారు హెల్ప్ డెస్క్ కాల్ చేయాలని రెండో మెసేజ్‌లో పేర్కొంది. తొలగించిన ఉద్యోగులకు మూడు నెలల వేతనం, బెనిఫిట్స్ అందించనున్నట్లు అమెజాన్ పేర్కొంది.

### భారీగా ఖర్చయినా కూడా..

ప్రపంచ ప్రసిద్ధి గాంచిన సంస్థల నుంచి స్టార్టప్ కంపెనీల వరకూ అన్ని ఏఐ వైపు అడుగులు వేస్తున్నాయి. మానవ వనరుల అవసరం లేకుండా కృత్రిమ మేధాతో పనులు జరిగిపోతున్న తరుణంలో కంపెనీలు అటువైపే దృష్టి సారిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఉద్యోగుల తొలగింపునకు సిద్ధపడుతున్నాయి. ప్రపంచ ఐటీ దిగ్గజాలు తమ ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవడానికి లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. దీర్ఘకాలికంగా ఖర్చులను కొనసాగించే బదులు ప్రస్తుతం ఒకేసారి ఆర్థిక భారాన్ని స్వీకరించడానికి మొగ్గు చూపుతున్నాయి. లేఆఫ్స్ ప్రకటిస్తున్న కంపెనీలు.. సిబ్బందికి భారీ మొత్తంలో చెల్లించేందుకు సిద్ధపడుతున్నాయి. టీసీఎస్ తమ ఉద్యోగుల తొలగింపు కోసం దాదాపు రూ.1,135 కోట్లు, యాక్సెంచర్ మూడేళ్లలో సెవరెన్స్ కోసం 2 బిలియన్లకు పైగా ఖర్చు చేశాయి. రానున్న కాలంలో ఏఐ విస్తృతి పెరుగనున్న తరుణంలో భారీగా లేఆఫ్‌లు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా సుదర్శన్‌రెడ్డి



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నియమితులయ్యారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అలాగే ఆరు గ్యారంటీల అమలు బాధ్యతలను సైతం ఆయనకు అప్పగించారు. కేబినెట్ హోదా కల్పించారు. అలాగే మంత్రి వర్గ సమావేశాలకు ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు. అయితే సుదర్శన్ రెడ్డి రాష్ట్రంలో కాంగ్రెస్‌లోకి అధికారం వచ్చిన నాటి నుంచి మంత్రి పదవి ఆశిస్తున్నారు. కాగా.. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావును పౌర సరఫరాల సంస్థ ఛైర్మన్‌గా నియమించింది.

## ఇది కారు, బుల్డోజర్ మధ్య జరిగే ఎన్నిక: కేటీఆర్



**అక్షరటుడే, హైదరాబాద్:** కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో పలువురు ఎంఐఎం నేతలు కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదం లేదని ప్రజలు ప్రశ్నించాలన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలిచేది మాగంటి సునీతనే అని ధీమా వ్యక్తం చేశారు. ఇది కారు, బుల్డోజర్ మధ్య జరిగే ఎన్నిక అని అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రౌడీయిజం పెరిగిపోయిందని విమర్శించారు. ఈ సర్కారు ఎవరినీ వ్యాపారాలు చేసుకోనివ్వడం లేదంటూ దుయ్యబట్టారు.



మంత్రిగా ప్రమాణం చేసిన అజారుద్దీన్

కాంగ్రెస్ నాయకుడు, భారత మాజీ క్రికెటర్ అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.


– అక్షరటుడే, హైదరాబాద్

## సీపీఐ నాయకుడి హత్య



**అక్షరటుడే, ఖమ్మం :** ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడులో చోటుచేసుకున్న దారుణ హత్య రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ప్రముఖ సీపీఎం నాయకుడు సామినేని రామారావును ముగ్గురు దుండగులు శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన సమయంలో గొంతుకోసి హత్య చేశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. దుండగులు పక్కా ప్లాన్ ప్రకారమే రామారావుపై దాడి చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. "హింసాయుత రాజకీయాలకు తెలంగాణలో తావు లేదు. దోషులను వేటాడి చట్టం ముందుకు తీసుకువస్తాం" అని ఆయన స్పష్టం చేశారు. భట్టి విక్రమార్క ఖమ్మం జిల్లా పోలీసు అధికారులతో అత్యవసరంగా సమావేశమై, క్లూస్ టీం, సైబర్ టీం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో దోషులను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని ఆదేశించారు.

## కెమెరా ముందు బాలయ్య కూతురు మెరుపులు



**నందమూరి బాలకృష్ణ రెండో కుమార్తె తేజస్విని మొదటిసారి ఒక యాడ్ ఫిల్మ్ నటించారు. ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ 'సిద్ధార్థ ఫైన్ జ్యువెలర్స్'కు ఆమె బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. ఈ యాడ్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తేజస్విని లుక్స్, స్మైల్, ఎక్స్‌ప్రెషన్స్ చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. కేవలం యాడ్ కాకుండా, ఇది ఒక కాన్సెప్ట్‌తో కూడిన మినీ మూవీలా తెరకెక్కించారు. ఈ యాడ్‌ను డి యమునా కిశోర్ తెరకెక్కించగా, థమన్ అందించిన సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యాడ్ ప్రారంభంలో తేజస్విని మోడ్రన్ లుక్‌లో ఇండోర్ రాక్ క్లైంబింగ్ చేస్తూ కనిపిస్తారు.**

- అక్షరటుడే, సినిమా డెస్క్

## భారత్‌పై ఆసీస్ విజయం

**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టీ 20లో భారత్ ఓటమి పాలైంది. తొలుత ఇండియా బ్యాటింగ్‌కు దిగగా.. ఓపెనర్ అభిషేక్ శర్మ (68) ఒంటరి పోరాటం చేశాడు. మిగతా బ్యాట్స్‌మెన్ సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితం అయ్యారు. గిల్ 5, శాంసన్ 2, సూర్యకుమార్ యాదవ్ 1 పరుగుకే పెవిలియన్ చేరారు. తిలక్ వర్మ, కుల్దీప్ యాదవ్, బుమ్రా డకౌట్ అయ్యారు. హర్షిత్ రానా 35 పరుగులతో రాణించాడు. దీంతో భారత్ 125 పరుగులకే ఆలౌట్ అయింది. త్వరాత బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ జట్టు ఆరు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

## శత్రుదేశాలకు మన సత్తా తెలిసింది: మోదీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఆపరేషన్ సిందూర్‌తో శత్రుదేశాలకు మన సత్తా ఏంటో తెలిసిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం గుజరాత్‌లోని పటేల్ విగ్రహం వద్ద ప్రధాని నివాళులర్పించారు. భారతదేశం తన శత్రువులకు ఎలా స్పందిస్తుందో నిర్ణయాత్మకంగా, బలంగా ప్రపంచానికి కనిపిస్తుంది అని నొక్కి చెప్పారు. ఆపరేషన్ సిందూర్ భారతదేశం శత్రు భూభాగంలోకి ప్రవేశించి దాడి చేయగలదనే సందేశాన్ని పంపిందన్నారు. ఎవరైనా భారత్ వైపు దృష్టి సారించడానికి ధైర్యం చేస్తే, భారత్ ఘర్ మే ఘుస్ కర్ మార్తా హై అని ప్రపంచం మొత్తం చూసిందని చెప్పారు. పాకిస్థాన్, ఉగ్రవాదాన్ని నిర్వహించేవారికి భారతదేశం నిజమైన బలం ఏమిటో తెలుసని అని పేర్కొన్నారు.